ANN తెలుగు

Follow: @ANNTELUGU

21-06-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 170 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

ప్రశ్నలు సజావుగా జరగాలంటే 'డిజిటల్ లాక్‌డౌన్' తప్పదా? యాప్‌లపై తాత్కాలిక నిషేధాలతో ప్రశ్నాపత్రాల లీకేజీల మహమ్మారిని అడ్డుకోగలమా? సాంకేతికతను బంధిస్తే సరిపోతుందా... వ్యవస్థ లోపల తిష్టవేసిన అవినీతి తిమింగలాలకు ఈ 'లాక్‌డౌన్' అసలైన మెడిసిన్ అవుతుందా? లీకేజీల వెనుక ఉన్న అసలు పాపాత్ములపై ఉక్కుపాదం మోపేదెన్నడు? జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్న 'నీట్' లీకేజీ బాధ్యత నుండి, కేవలం 'రీఎగ్జామ్' అనే వంకతో కేంద్ర సర్కారు చేతులు దులుపుకుందా? దేశ భవిష్యత్తు అయిన యువత రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే... ప్రభుత్వం ఆ ఆందోళనలను 'లైట్' తీసుకోవడం ఎంతవరకు సమంజసం? విద్యార్థి లోకాన్ని వేధిస్తున్న ప్రశ్నలపరంపర ఇది. తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన మూసీ ప్రాజెక్టు అడుగులు ముందుకు పడ్డట్లేనా? విపక్షాల విమర్శలు, ఆందోళనల మధ్యే గాంధీసరోవర్ పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల ఫలించినట్లేనా? ఇటు ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన సాయికృష్ణ లాకప్ డెత్ వ్యవహారం కూటమి ప్రభుత్వానికి అంత సులువుగా చెరిగిపోని మాయని మచ్చగా మారబోతోందా?

04




## తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్

కంది రామచంద్రారెడ్డి

వీకెండ్ అనాలసిస్

టాప్ న్యూస్

## భారత్ ధర్మసత్రం కాదు : అమిత్ షా వ్యాఖ్యలు



చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు

02

## హైదరాబాద్ ప్లస్'గా అమరావతి నిర్మాణం



- ఇంటింటికీ యోగాను తీసుకెళ్తాం.
- జాతీయ మీడియాతో సీఎం చంద్రబాబు.

02

## అక్కడే చూసుకోండి.. ఇక్కడకు రావొద్దు



- తెలంగాణ రాజకీయాల్లో జోక్యం వద్దు
- సినిమాలు వేరు, రాజకీయాలు వేరు
- పవన్‌కు కవిత మరోసారి వార్నింగ్

02



## వర్చువల్ కుదరదు

- కోర్టుకు హాజరు కావాల్సిందే
- అల్లు అర్జున్‌కు న్యాయస్థానం ఆదేశం

02

# అక్రమాలపై.. మహా అంకుశం

## భూమాఫియా గుండెల్లో 'టాస్క్ ఫోర్స్' అక్షర పాశుపతాస్త్రం కదలివచ్చిన అధికార యంత్రాంగం!

**హైదరాబాద్, మహాటాస్క్ ఫోర్స్**

సమాజంలో వేళ్లూనుకుపోతున్న అన్యాయాలపై, అక్రమార్కుల గుట్టుపై 'మహా' పత్రిక అంకుశంలా అక్షర పాశుపతాస్త్రాలను సంధించింది. ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించి.. మధ్యతరగతి ప్రజల సొంతింటి ఆశలను వంచించి.. కోట్లు కొల్లగొడుతున్న నయా దగాకోరుల బండారాన్ని బట్టబయలు చేసింది. రెవెన్యూ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న భూమాఫియా వెనుక ఉన్న అసలు గుట్టును కళ్లకు కడుతూ.. 'మహా టాస్క్ ఫోర్స్' క్షేత్రస్థాయి పరిశోధనలతో నిజాలను నిగ్గుతేల్చింది. మిగతా 2వ పేజీలో






## 16 రకాల కాంబినేషన్ ఔషధాలపై కేంద్రం కొరడా

- తక్షణమే నిషేధం అమలు.
- స్పష్టం చేసిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ.

03

## కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి మరో లేఖ

- ఇద్దరం కలిసి వెళ్దాం.. నేను ఢిల్లీలోనే ఉంటా
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్ మెంట్ ఫిక్స్ చేయండి
- మెట్రో ఫేజ్-2, ఐఆర్ఎఫ్‌సీ నిధులపై కేంద్రం చొరవ చూపాలి

02



## యోగా ఒక మతానికి పరిమితం కాదు

### అలా చూడటం మూర్ఖత్వం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా యోగా ఉత్సవాలు
- ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప కానుక యోగా అన్న వెంకయ్య నాయుడు
- మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం యోగా అని వ్యాఖ్య

03





## మళ్లీ యుద్ధ మేఘాలు

- హోర్ముజ్ జలసంధి మూసివేత.
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- ఐదుగురు మృతి
- ఇరాన్ ప్రకటనను తోసిపుచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.


03

## పోక్సో కేసులో బండి భగీరథ్ కు ఊరట

- వారం రోజులు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు
- చర్లపల్లి జైలు నుంచి విడుదల
- పరీక్షల కోసం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన కోర్టు
- 26 వరకు బెయిల్ పై ఇంట్లో ఉండనున్న భగీరథ్

03





## యధేచ్ఛగా అక్రమ నిర్మాణం

- చోద్యం చూస్తున్న మునిసిపల్ అధికారులు
- ఫిర్యాదు చేసిన ఔ పట్టించుకోని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సొసైటీ సభ్యులు

02

## సీఎం అయినా.. భార్య పర్మిషన్ తీసుకోవాల్సిందే!

- పల్నాడు పర్యటనలో ఆసక్తికర ఘట్టం
- కోల్డ్ ప్రెస్డ్ నూనె కొనుగోలుకు ముందు భువనేశ్వరికి చంద్రబాబు ఫోన్
- ప్రకృతి వ్యవసాయంపై రైతుల కృషికి ముఖ్యమంత్రి అభినందనలు.

02







# యథేచ్ఛగా అక్రమ నిర్మాణం



**హైదరాబాద్, మహా :** అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం మోపాల్సిన మునిసిపల్ అధికారులు భవన అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మునిసిపల్ అధికారులపై తీరుపై బంజారాహిల్స్ లోని శ్రీ వేంకటేశ్వర కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వీఐపీలు, ఉన్నతాధికారులు తిరిగే కాలనీలో భవన నిర్మాణ పనులు నిరంతరం సాగుతున్నా అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై కాలనీ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 లోని ఎమ్మెల్యే కాలనీలో ఫ్లాట్ నంబర్ 55 ఏ కు సంబంధించిన యజమాని భవన నిర్మాణం కోసం మునిసిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే అధికారులు అనుమతించిన సిల్ట్ ప్లస్ 4 అంతస్థుల అనుమతికి బదులు ఆరంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు, సొసైటీ సభ్యులు స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు సర్కిల్ 36 డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ భవన నిర్మాణ పనులను కనీసం పరిశీలించని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సొసైటీ అధ్యక్షులు నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను ఆపాల్సిన అధికారులు మౌనం వహించడం వెనుక ఏదో మతలబు ఉందని ఆయన ఆరోపించారు. అక్రమ నిర్మాణాన్ని ఆపాలాని కోరుతూ అధికారులను పలు పర్యాయాలు కలవడం జరిగిందని, అయినా ఫలితం లేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని ఆపాలాని కోరారు. కఆరంతస్థుల భవన నిర్మాణం వల్ల కార్ల పార్కింగ్ తో పాటు అనేక రకాల ఇబ్బందులను కాలనీ వాసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

# అక్రమాలపై.. మహా అంకుశం

( మొదటి పేజీ తరువాయి )

గత నెలరోజులుగా 'మహా' సంధించిన అక్షర తూటాలకు పాఠకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతుండగా, అటు ప్రభుత్వ యంత్రాంగంలోనూ చలనం మొదలైంది. కొన్నిచోట్ల అధికారులు కొరడా ఝుళిపించి తప్పులను సరిదిద్దగా.. మరికొన్ని చోట్ల మాత్రం అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కేస్తూ అక్రమార్కులకు పరోక్షంగా కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'మహా టాస్క్ ఫోర్స్' కథనాలు సృష్టించిన ప్రకంపనల వివరాలు ఇలా ఉన్నాయి.










**1. నారాయణఖేడ్ 'శ్రీకారం' అక్రమాల గుట్టురట్టు!**

ఫార్మ్‌లాండ్స్, అక్రమ వెంచర్ల పేరిట సాగుతున్న భారీ దందాకు 'మహా' పత్రిక చెక్ పెట్టింది. నారాయణఖేడ్ వేదికగా "శ్రీకారం సంస్థ", "ఆయుష్మాన్ భవ", "ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్ లాండ్" పేర్లతో నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న అక్రమ వెంచర్ల భాగోతాన్ని ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. అమాయక ప్రజలను ఆకర్షించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న ఈ సంస్థల వెనుక ఉన్న అదృశ్య హస్తాలను, రెవెన్యూ అధికారుల లోపాయికారీ సహకారాన్ని 'మహా' ఎండగట్టింది.

**2. కొండాపూర్ కోటలు బద్దలు: రూ.10 కోట్ల ప్రభుత్వ ఆస్తి స్వాధీనం**

కొండాపూర్ లోని సర్వే నెంబర్ 59లో కొందరు అక్రమార్కులు ఏకంగా ప్రభుత్వ భూమినే మింగేశారు. అధికారుల కళ్లు గప్పి.. ఏకంగా ఏడంతస్తుల భారీ భవనాన్ని లేపేశారు. ఈ బహుళ అంతస్తుల అక్రమ కట్టడం వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులను 'మహా' వరుస కథనాలతో ఎండగట్టింది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి, సుమారు రూ. 10 కోట్ల విలువైన ఆ ఏడంతస్తుల భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఇది 'మహా' అక్షర శక్తికి దక్కిన విజయకేతనం.

**3. 'ఏపీఆర్ ప్రవీణ్స్' పై కొరడా!**

రియల్ ఎస్టేట్ ముసుగులో 'ఏపీఆర్ ప్రవీణ్స్' సంస్థ చేసిన భూ ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలపై 'మహా' పత్రిక నిరంతరం గొంతు విప్పింది. ఈ సంస్థ చేసిన బరితెగింపులను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడంతో 'మహా ఎఫెక్ట్' గట్టిగా తగిలింది. రంగంలోకి దిగిన అధికారులు ఆక్రమిత ప్రాంతాల్లో ప్రహరీలను బుల్డోజర్లతో భారీ కూల్చివేతలు చేపట్టారు.

**4. 'రాక్ వెల్ స్కూల్' ఉల్లంఘనల గుట్టురట్టు**

విద్యాసంస్థల పేరిట సాగుతున్న అక్రమాలను సైతం 'మహా టాస్క్ ఫోర్స్' వదిలిపెట్టలేదు. శంషాబాద్ 'రాక్ వెల్ స్కూల్' యాజమాన్యం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ సాగిస్తున్న వ్యవహారాలపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో ఉలిక్కిపడిన విద్యాశాఖ అధికారులు పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ కోరారు.

**5. అత్వెల్లిలో 'మైల్ స్టోన్' అక్రమం.. ఇరిగేషన్ నోటీసులు!**

ప్రకృతి ప్రసాదించిన నాలాలను సైతం వదలకుండా అత్వెల్లిలో 'మైల్ స్టోన్' నిర్మాణ సంస్థ సాగించిన అక్రమ దందాను 'మహా' పత్రిక వరుస కథనాలతో బట్టబయలు చేసింది. పెద్ద చెరువు నాలాలు, అలుగులు కబ్జా.. నోట్ల కట్టలతో హెచ్ఎండీఏ నోళ్లు మూయించిన రియల్ మాఫియాపై మహాపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా పెద్ద చెరువు నాలాలు, అలుగులను మింగేస్తూ.. కల్వర్టుల మధ్యే ఏకంగా వెంచర్ కమాన్‌ను నిర్మించారు. అధికారుల అండ: ఇరిగేషన్ అధికారులు ఎన్ఓసీ జారీ చేయకపోయినా.. కోట్లు మింగిన హెచ్ఎండీఏ అధికారులు ఈ వివాదాస్పద లేఅవుట్‌కు అనుమతులు మంజూరు చేయడం గమనార్హం. 'మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్' వరుస కథనాలతో ఈ అవినీతి భాగోతాన్ని ఎండగట్టడంతో ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు నిద్రలేచారు. నాలాల ఆక్రమణపై సదరు మైల్ స్టోన్ సంస్థకు లీగల్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే రిపోర్టులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**మహా హెచ్చరిక:** అక్రమాలపై 'మహా' సంధించిన అక్షర అస్త్రం ఇక్కడితో ఆగదు. ప్రజాధనాన్ని, ప్రభుత్వ భూములను కొల్లగొట్టే అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కొన్నిచోట్ల ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ, అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్న అధికారుల వ్యవహారాలను సైతం త్వరలోనే 'మహా టాస్క్ ఫోర్స్' బయటపెట్టబోతోంది. స్టే ట్యూన్డ్!

# పేడలో పుట్టిన పురుగులు మళ్లీ అక్కడికే వెళ్లాయి

**రెబల్ ఎంపీలపై రౌత్ ఘాటు వ్యాఖ్యలు**

మహా : శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ పార్టీని వీడిన నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ధారాశివ్ ఎంపీ ఓంరాజే నింబాల్కర్, హింగోలి ఎంపీ నగేశ్ పాటిల్ అస్థికర్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. పార్టీ ఇచ్చిన అవకాశాలతోనే రాజకీయంగా ఎదిగిన నేతలు ఇప్పుడు పార్టీని వీడడం ద్రోహమని రౌత్ అన్నారు. ఒకప్పుడు ఉద్ధవ్ ఠాక్రేను ఎప్పటికీ వదిలిపెట్టనని చెప్పిన నేతలే ఇప్పుడు మారిపోయారని ఎద్దేవా చేశారు. ''పేడలో పుట్టిన పురుగులు మళ్లీ పేడలోకే వెళ్లాయి'' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కూడా రౌత్ విమర్శలు సంధించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నా రాజకీయాల్లో పరిస్థితులు ఎప్పుడైనా మారిపోతాయని అన్నారు. ఈ రోజు ఉన్న పదవులు రేపు ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు. షిండేను పెద్ద రాజకీయ నాయకుడిగా చూపించే ప్రయత్నాలను కూడా ఆయన కొట్టిపారేశారు.



# కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి మరో లేఖ.

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థకు అత్యంత కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్టు పెండింగ్ అంశాల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మరోసారి లేఖ రాశారు. ప్రధానంగా మెట్రో ఫేజ్ 2 విస్తరణతో పాటు, ప్రాజెక్టుకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) నిధుల విడుదలపై తక్షణమే చర్చలు జరపాల్సి ఉందని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు. ఈ నెల 16న కూడా ఇదే అంశంపై తాను లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఒక ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రానున్న జూన్ 22, 23 తేదీల్లో తాను అధికారిక పర్యటన నిమిత్తం ఢిల్లీలో ఉండనున్నట్లు రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా, ఆ సమయంలో తామిద్దరం (ముఖ్యమంత్రి, కిషన్‌రెడ్డి) ఉమ్మడిగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసేలా అపాయింట్‌మెంట్ ఖరారు చేయాలని కోరారు. హైదరాబాద్ నగరానికి, రాష్ట్ర ప్రగతికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని, దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఉద్ఘాటించారు. రైల్వే మంత్రితో జరిగే భేటీకి ప్రాజెక్టు ఒప్పందాలు, సంబంధిత పత్రాల కాపీలు సహా పూర్తి వివరాలను తాను స్వయంగా తీసుకువస్తానని ముఖ్యమంత్రి వివరించారు. ఈ మేరకు సమావేశాన్ని ఖరారు చేసి తనకు వివరాలు తెలియజేయాలని కిషన్‌రెడ్డిని ఆయన కోరారు.



## అక్కడే చూసుకోండి.. ఇక్కడకు రావొద్దు

**పవన్‌కు కవిత మరోసారి వార్నింగ్**

**హైదరాబాద్, మహా :** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏపీలోనే రాజకీయాలు చేసుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ మణికొండలో జనసేన కార్యాలయాన్నిపవన్ కల్యాణ్ ప్రారంభించడం, ఇటీవల జరిగిన పరిణామాలపై ఆమె స్పందించారు. పవన్ కల్యాణ్ సినిమాలు చూసి సంతోషిస్తామని చెప్పిన ఆమె సినిమాల ముసుగులో వచ్చి తెలంగాణను కబ్జా చేస్తారని వ్యాఖ్యానించారు. గతంలోనూ ఇదే జరిగిందన్నారు. సినిమాల ముసుగులో వచ్చి ఆంధ్ర భాష బాగుంది.. తెలంగాణ యాస బాగోలేదని మొదలు పెడతారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ పుట్టకముందే తమను ఏడ్పించారని, తెలంగాణ యాసలో మాట్లాడలేని పరిస్థితులు ఉండేవన్నారు. తెలంగాణ యాసలోనే, భాషలోనే మాట్లాడతామని కొట్లాడినామని కవిత చెప్పారు. ''మా ఊరు భువనగిరి.. నా పేరు యాదగిరి.. నేను చేసేది దాదాగిరి'' అనే సినిమా డైలాగు చెప్పి తెలంగాణలోని అన్ని ప్రాంతాలవారిని అవమానించారని కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం తర్వాత తెలంగాణ డైలాగ్స్‌ను హీరోలకు పెట్టడం ప్రారంభించారని చెప్పారు. తెలంగాణ భాషలో మాట్లాడటం ఫ్యాషన్ అయిందని, పవన్ కల్యాణ్ సినిమాలు చూడాలని, అతని డ్యాన్స్ చూసి సంబురపడాలని, కానీ రాజకీయాల్లో రానివద్దని యువతకు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రండి.. పోండి.. మేకప్, పేకప్‌లు చెప్పుకోండి కానీ రాష్ట్ర సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకునేది లేదని జనసేన పార్టీ నేతలు, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కల్వకుంట్ల కవిత హెచ్చరించారు.

# సీఎం అయినా.. భార్య పర్మిషన్ తీసుకోవాల్సిందే!

**పల్నాడు,మహా :** ముఖ్యమంత్రి హోదాలో నిత్యం పాలనా వ్యవహారాలతో ఎంత బిజీగా ఉన్నా.. ఇంటి విషయానికొచ్చేసరికి ఇల్లాలు మాటే శాసనం! ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా పర్యటనలో సరిగ్గా ఇలాంటి ఆసక్తికర ఘటనే చోటుచేసుకుంది. ఒక రైతు వ్యవసాయ క్షేత్రంలో స్వచ్ఛమైన కోల్డ్‌ప్రెస్డ్ (గానుగ) వేరుశనగ నూనెను కొనుగోలు చేసే ముందు, చంద్రబాబు తన సతీమణి నారా భువనేశ్వరికి అక్కడికక్కడే ఫోన్ చేసి మాట్లాడటం అందరినీ ఆకర్షించింది. "ఇంట్లోకి ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా ఆమెను అడగాల్సిందే" అంటూ సీఎం నవ్వుతూ చేసిన సరదా వ్యాఖ్యలు అక్కడున్న వారిలో ఉత్సాహాన్ని నింపాయి. శనివారం చిలకలూరిపేట సమీపంలోని లింగంగుంట్లలో ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో లింగంగుంట్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతు గుడిపల్లి నాగభూషణం వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. గత నాలుగేళ్లుగా రసాయన ఎరువులు లేకుండా పూర్తిగా ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో సాగు చేస్తున్న విధానాలను నాగభూషణం ముఖ్యమంత్రికి సవివరంగా తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గడమే కాకుండా, భూసారం పెరిగి మంచి దిగుబడులతో వ్యవసాయం లాభసాటిగా మారిందని ఆయన తెలిపారు. దీనిపై హర్షం వ్యక్తం చేసిన చంద్రబాబు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నాగభూషణం లాంటి ఆదర్శ రైతులను చూసి మిగతా వారు స్ఫూర్తి పొందాలని ఆయన కొనియాడారు.

అనంతరం రైతు నాగభూషణానికి చెందిన ఆర్గానిక్ వేరుశనగ గానుగ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలించారు. వేరుశనగ, నువ్వులు, కొబ్బరి తదితర నూనె గింజల నుంచి అత్యంత సహజ పద్ధతిలో నూనెను ఎలా తీస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ స్వచ్ఛమైన నూనెను ఒకసారి వాడి చూడాలని రైతు కోరగా.. ముఖ్యమంత్రి వెంటనే తన సతీమణి భువనేశ్వరికి ఫోన్ చేసి కనుక్కుని మరీ కిలో నూనెను కొనుగోలు చేయడం విశేషం. ఇలాంటి సంప్రదాయ గానుగ పరిశ్రమల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని కూడా సందర్శించిన సీఎం.. అక్కడ జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాలను తిలకించారు. రైతు సాగు చేస్తున్న బొప్పాయి తోటను పరిశీలించి, ఆయన ప్రేమగా అందించిన ఆర్గానిక్ బొప్పాయి పండును ముఖ్యమంత్రి రుచి చూశారు. అంతర పంటల సాగుతో జీవ వైవిధ్యం పెరిగి చీడపీడల బెడద ఎలా తగ్గుతుందో ఈ సందర్భంగా రైతు ముఖ్యమంత్రికి వివరించారు.

# హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం

**విశాఖపట్నం, మహా** : ఏపీ రాజధాని అమరావతిని హైదరాబాద్ ప్లస్'గా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉండవల్లి గుహల వద్ద ఏర్పాటు చేసిన 'యోగాంధ్ర' కార్యక్రమం సందర్భంగా ఆయన జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్‌ను నిర్మించిన తర్వాత, ఇప్పుడు నవ్యాంధ్రకు అమరావతిని నిర్మించే అదృష్టాన్ని భగవంతుడు తనకు ప్రసాదించాడని పేర్కొన్నారు. సైబరాబాద్, హైదరాబాద్ నగరాలు నేడు తెలంగాణ రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయని, దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఎదిగిందని ఆయన గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో అమరావతిని ఆరోగ్య, సంపన్న, ఆనంద, ఆధ్యాత్మిక నగరంగా (హెల్తీ, వెల్తీ, హ్యాపీ సిటీగా), ఒక అద్భుతమైన నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. గతంలో విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించామని, ఈ ఏడాది ఆ వేడుకలను అమరావతి వేదికగా భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత అమూల్యమైన బహుమతి యోగా అని ఆయన అభివర్ణించారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని పూర్తిగా జయించి, అపారమైన ఏకాగ్రతను సాధించవచ్చని స్పష్టం చేశారు. యోగాను ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనిని ఒక మిషన్ మోడ్‌లో ప్రజలకు చేరువ చేస్తామన్నారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా యోగా విశిష్టతను చాటిన ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ తో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని వివరించారు. కేవలం టెక్నాలజీ మాత్రమే పూర్తి సంపదను, సంతోషాన్ని సృష్టించలేదని, భారతదేశానికి ఉన్న నిజమైన, అత్యంత అమూల్యమైన శక్తి ఇక్కడి ఉత్కృష్టమైన ఆధ్యాత్మికత, సంస్కృతేనని చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. నేటి యువత అత్యాధునిక సాంకేతికతతో పాటు మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్తు వైపు విజయవంతంగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు.

## తెలంగాణ అమరవీరుల స్తూపం కరపత్రం ఆవిష్కరణ...

**యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా**



తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా జూన్ 21 చలో డిండి చింతపల్లి తెలంగాణ అమరవీల స్థూపం ఆవిష్కరణ, ర్యాలీ బహిరంగ సభ జయప్రదం చేయాలని కరపత్రాన్ని శనివారం తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్ర జాన్సన్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఆవిష్కరింప చేశారు



## భారత్ ధర్మసత్రం కాదు : అమిత్ షా వ్యాఖ్యలు

**చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు**

**ముంబై, మహా :** శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

## భారతదేశం పై ఎల్నినో ముప్పు..!

**మహా వరంగల్ బ్యూరో:** దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల పై ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం ఏర్పడుతున్న పరిస్థితులు మరింత బలపడి సూపర్ ఎల్ నినోగా మారే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2015 లో నమోదైన ఎల్నినో పరిస్థితులను తలపించే విధంగా ఈసారి ప్రభావం ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం, వాతావరణంలో అసాధారణ మార్పులు చోటుచేసుకోవడం వల్ల దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో సాధారణ వర్షపాతం కంటే సుమారు 10 శాతం వరకు తగ్గుదల నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి కీలకమైన ఖరీఫ్ సీజన్తో పాటు సీతాకాల వాతావరణం పై కూడా ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు, తాగునీటి కొరత వంటి సమస్యలు తలెత్తే అవకాశ మున్నందున రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. వాతావరణ మార్పులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# వర్చువల్ కుదరదు కోర్టుకు హాజరు కావాల్సిందే

హైదరాబాద్, మహా : సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌కు మరో షాక్ తగిలింది. ఈ కేసులో విచారణకు ఆన్ లైన్ ద్వారా హాజరవుతానన్న బన్నీ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. కోర్టుకు రావాల్సిందేనని స్పష్టం చేసింది. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్ 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ముంబైలో షెడ్యూల్ జరుగుతోంది. భద్రతా కారణాలు, మూవీ షూటింగ్ నేపథ్యంలో వర్చువల్ (ఆన్ లైన్) ద్వారా కోర్టు విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని బన్నీ నాంపల్లి కోర్టును అభ్యర్థించారు. అయితే, అలా కుదరదని కచ్చితంగా కోర్టు ముందు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది న్యాయస్థానం. దీంతో ఆయన సోమవారం బన్నీ నాంపల్లి కోర్టుకు హాజరు కానున్నారు. దీంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏ11గా బన్నీ**

ఈ కేసులో బన్నీని పోలీసులు ఏ11గా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకూ నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. ఇప్పటివరకూ 23 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. మొత్తం 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. 2024, డిసెంబర్ 4న పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా... ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అభిమానులతో కలిసి ప్రీమియర్ షో చూసేందుకు వెళ్లిన బన్నీని చూసేందుకు ఫ్యాన్స్ ఒక్కసారిగా దూసుకురావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనకు యాజమాన్యంతో పాటు బన్నీని కూడా బాధ్యున్ని చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఘటన తర్వాత బాధిత కుటుంబానికి అల్లు అర్జున్‌తో పాటు మూవీ టీం అండగా నిలిచింది. బాలుడు శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వైద్య సాయంతో పాటు ఫ్యామిలీకి కూడా సాయం అందించారు.



# మళ్లీ యుద్ధ మేఘాలు.

**ఢిల్లీ, మహా** : పశ్చిమాసియాలో శాంతి ఒప్పందాలు జరిగినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు మరోసారి అత్యంత తీవ్రరూపం దాల్చాయి. లెబనాన్ భూభాగంపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) నిరంతరాయంగా దాడులు కొనసాగిస్తుండటం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామాలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ జలమార్గం 'హోర్ముజ్ జలసంధి'ని తాము అన్ని రకాల నౌకా రవాణాకు పూర్తిగా మూసివేసినట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అయితే, ఇరాన్ చేసిన ఈ వ్యాఖ్యలను అగ్రరాజ్యం అమెరికా తోసిపుచ్చింది. ప్రస్తుతం ఆ జలమార్గం గుండా నౌకల రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయని, జలసంధి తెరిచే ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు.లెబనాన్‌లోని నబతియెహ్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, అత్యాధునిక డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ భీకర దాడుల ధాటికి అక్కడి పౌరుల నివాస భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ వైమానిక దాడుల కారణంగా కనీసం ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పెద్ద సంఖ్యలో స్థానికులు తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దాడులను తీవ్రంగా పరిగణించిన ఇరాన్ సైనిక నాయకత్వం.. ఇజ్రాయెల్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. తాజా పరిణామాలు తమ తొలి ప్రతిస్పందన మాత్రమేనని, ఇజ్రాయెల్ గనుక తన దూకుడును తగ్గించుకోకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రమైన సైనిక చర్యలు ఉంటాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) హెచ్చరించింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధి వైపు ఏ నౌకలూ రాకూడదని ఐఆర్‌జీసీ ఆంక్షలు విధించింది. ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని మూసివేయడం ద్వారా అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను దెబ్బతీయాలని ఇరాన్ భావిస్తోంది. అయితే, ఇరాన్ హెచ్చరికలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తక్షణమే స్పందించారు. హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఆధారాలూ లేవని ప్రపంచ దేశాలకు భరోసా ఇచ్చారు. చమురు మోసుకెళ్లే కార్గో నౌకల ప్రయాణం యథావిధిగా కొనసాగుతోందని, పశ్చిమాసియాలోని తాజా పరిస్థితులను అమెరికా రక్షణ విభాగం అత్యంత నిశితంగా గమనిస్తోందని చెప్పారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరాన్ దౌత్యవేత్తలతో తాము నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు జేడీ వాన్స్ వెల్లడించారు.

# పవన్‌ను బూచిగా చూపి తెలంగాణలో పాగాకు బీజేపీ ప్లాన్

**పవన్ ను బూచిగా చూపి**
**తెలంగాణలో పాగాకు బీజేపీ ప్లాన్**
**టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్**
**సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా** : పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి తెలంగాణలో పాగా వేయాలని బీజేపీ చూస్తోందని, అయినప్పటికీ ఆ పార్టీకి రాష్ట్రంలో స్థానం లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. శాశ్వతంగా అధికారంలోకి ఉండటం కోసం ఎంతకైనా తెగిస్తున్నారని, బీజేపీ చెప్పిందే రాజ్యాంగం అన్నట్టు వ్యవహరిస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విరుచుకుపడ్డారు. ప్రాంతీయ పార్టీలను చీల్చి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విశ్వవిద్యాలయాల్లోకి దూరిన బీజేపీ రఘుపతి రాఘవ రాజారాం పేరు స్థానంలో గాడ్సే జపం చేస్తోందని ధ్వజమెత్తారు. గాడ్సే రాజ్యం స్థాపన వ్యూహంతో సొంత ఎజెండాను తీసుకొచ్చిన కమలం పార్టీ జనాలపై రుద్దుతుందని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఊదరగొట్టిన బీజేపీ ఇప్పుడు ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతోందని, 90 శాతం సంపద బీజేపీ నాయకుల అనుచరుల చేతిలో ఉందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు వర్సిటీల్లోకి దూరి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.
సరిహద్దుల్లో భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొస్తుంటే ఆ విషయం గురించి బీజేపీ నోరెత్తడం లేదని, లోక్‌సభలో తమ నాయకుడు రాహుల్ గాంధీ ఈ విషయాన్ని ఫోటోలతో సహా చూపించారని పేర్కొన్నారు. అంతేకాదు, గాంధీ కుటుంబం త్యాగానికి మారుపేరని, గాంధీ, నెహ్రూల గురించి బీజేపీ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు అర్పించారని పీసీసీ చీఫ్ గుర్తు చేశారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశం గురించి ప్రస్తావిస్తూ ఈ విషయంలో దుర్మార్గంగా వ్యవహరించారని, అసలు కేసు లేకుండా నామినేషన్ తిరస్కరించిన రిటర్నింగ్ ఆఫీసర్‌ను ఉరి తీసినా తప్పులేదన్నారు. అంతేకాదు, ఝార్ఖండ్‌లో మాత్రం అంబానీలకు చెందిన వ్యక్తికి సరైన పత్రాలు లేకపోయినా మరోసారి అవకాశం ఇచ్చారని ఆయన ఆరోపించారు. దేవుడు పేరు చెప్పకుండా గెలిచే దమ్ము బీజేపీ నేతలకు ఉందా? అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారన్నారు. లౌకిక వాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

# సీతమ్మసాగర్ పేరిట వేలకోట్ల ఇసుక దోపిడీ: కవిత

**వరంగల్, మహా బ్యూరో** :సీతమ్మసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంతం పేరిట భారీ స్థాయిలో ఇసుక దోపిడీ జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే మంత్రుల సహకారంతో సుమారు 70 కిలోమీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల నేల వరంగల్ అని పేర్కొంటూ, కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు.వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీ ప్రాంతాలకు తెలంగాణ ఏర్పడిన తర్వాత చెప్పుకోదగ్గ విద్యాసంస్థలు రాలేదని, ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ విశ్వవిద్యాలయం వంటి కీలక సంస్థలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కేయూలో హాస్టళ్లు, నియామకాల సమస్యలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.సీతమ్మసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల గోదావరి పరివాహక ప్రాంతం తీవ్రంగా దెబ్బతింటోందని, ఆదివాసీలు ఎన్జీటీలో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులు, యువత, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ సందర్భంగా పార్టీ 'పాంచజన్యం' పేరుతో విద్య, వైద్యం, సామాజిక న్యాయం, ఉపాధి, యువత సాధికారత వంటి ఐదు ప్రధాన అంశాలతో ప్రజల్లోకి వెళ్తామని కవిత తెలిపారు.పవన్ కళ్యాణ్‌పై స్పందిస్తూ సినీ నటులను వినోద రంగానికి పరిమితంగానే చూడాలని, నటనకు రాజకీయాలకు తేడా ఉందని యువత గుర్తించాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే రాజకీయాలకే ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 16 రకాల కాంబినేషన్ ఔషధాలపై కేంద్రం కొరడా.

- **తక్షణమే నిషేధం అమలు.**
- **స్పష్టం చేసిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ.**



**హైదరాబాద్, మహా**: వైద్యపరంగా సరైన ఆధారాలు లేని, రోగుల చికిత్సలో ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం చేకూర్చని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఈ మందుల తయారీ, అమ్మకం, పంపిణీపై తక్షణమే నిషేధం విధిస్తూ కఠిన చర్యలు చేపట్టింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.రెండు లేదా అంతకంటే ఎక్కువ ఔషధ పదార్థాలను ఒకే మాత్ర లేదా సిరప్ రూపంలో కలిపి తయారు చేయడాన్ని వైద్య పరిభాషలో 'ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్' (ఎఫ్‌డీసీ) అంటారు. అయితే, తాజాగా నిషేధించిన ఈ 16 రకాల కాంబినేషన్లు పూర్తిగా అహేతుకమైనవని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. వీటి వల్ల రోగులకు అదనపు ప్రయోజనం ఏమీ కలగకపోగా, అనవసరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కమిటీ తీవ్రంగా హెచ్చరించింది. ఈ నిపుణుల కమిటీ సమర్పించిన నివేదిక, సిఫార్సుల ఆధారంగానే.. ఈ ఔషధాల వినియోగాన్ని మార్కెట్లో కొనసాగించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని ప్రభుత్వం నిర్ధారించి ఈ వేటు వేసింది.
తాజాగా నిషేధించిన వాటి జాబితాలో ప్రధానంగా యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు, కడుపునొప్పికి (తిమ్మిర్లు) వాడే మందులతో పాటు కలబంద (అలోవెరా) ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. ముఖ్యంగా అమోక్సిసిలిన్‌తో పాటు సెరాటియోపెప్టిడేస్, లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్ కలిపిన మందులు, సెఫ్యూరాక్సిమ్ సెరాటియోపెప్టిడేస్, సెఫాడ్రాక్సిల్ ప్రోబెనెసిడ్, డైసైక్లోమైన్‌పారాసెటమాల్‌క్లిడినియం బ్రోమైడ్‌క్లోర్డియాజెపాక్సైడ్ వంటి పలు కాంబినేషన్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. దేశ ప్రజలకు కేవలం అత్యంత సురక్షితమైన, దుష్ప్రభావాలు లేని, శాస్త్రీయంగా నిర్ధారించిన మందులు మాత్రమే అందుబాటులో ఉండేలా చూడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా కేంద్రం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న ఫార్మా కంపెనీలు, మెడికల్ షాపులు ఈ మందుల క్రయవిక్రయాలను తక్షణమే నిలిపివేయాల్సి ఉంటుంది.

# యోగా ఒక మతానికి పరిమితం కాదు



**హైదరాబాద్, మహా** : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని స్పష్టం చేశారు. "ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో 1డే కౌంట్ డౌన్ ఈవేంట్ లో భాగంగా యోగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడులతో పాటు పలువురు హాజరయ్యారు. ఈ యోగా మహోత్సవానికి నగర నలుమూలల నుండి యువతీ యువకులు, విద్యార్థులు, మహిళలు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వేదిక ప్రాంగణమంతా యోగా సాధకులతో కిక్కిరిసిపోయింది. కులమతాలకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపు నిచ్చారు. యోగా సాధన ద్వారా మానసిక దృఢత్వానికి సామాజిక ఆవశ్యకతపై వివరించారు. భారత ప్రాచీన యోగాను ప్రపంచానికి పరిచయం చేసి అంతర్జాతీయ స్థాయిలో విశేషా ప్రచూర్యం కల్పించిన వ్యక్తి ప్రధాని మోదీ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యోగా దినోత్సవ నేపథ్యాన్ని, ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో జరుగుతున్న యోగా ఉత్సవాల విశిష్టతను వివరించారు.
మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, దేశ యువత సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనాలు అత్యంత అవసరమన్నారు. భారత దేశ ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలలో యోగా ఒక భాగమని, ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే, మన దేశ సంపదైన యోగాను ప్రపంచ దేశాలన్నింటికీ పరిచయం చేశారన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా వేడుకలను ఘనంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి ఎంతో సంతోషాన్నిచ్చే విషయమన్నారు. యువతకు శారీరక, మానసిక దృఢత్వానికి యోగ అవసరం దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, నేటి యువత మానసికంగా ప్రశాంతంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే నిత్యం యోగాసనాలు వేయడం ఎంతో అవసరమన్నారు. యువత ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు యోగా ఒక అద్భుత సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకొని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్ కు ఊరట

**హైదరాబాద్, మహా** : తీవ్ర సంచలనం సృష్టించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో బిగ్ అప్‌డేట్ వచ్చింది. నెల రోజులకుపైగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్‌కు మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు షరతులో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇరు పక్షాల న్యాయవాదుల మధ్య కోర్టు హాల్‌లో సుదీర్ఘంగా సాగిన వాదోపవాదాల అనంతరం న్యాయస్థానం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌కు పరీక్షలు ఉన్నాయని చెప్పడంతో జూన్ 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ఈ హైప్రొఫైల్ కేసు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఒక కేంద్రమంత్రి కుమారుడు నిందితుడిగా ఉండటం, కేసులో తీవ్రమైన పోక్సో చట్టం సెక్షన్లు నమోదు కావడంతో పోలీసులు కూడా దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దాదాపు నెల రోజులపాటు జైలు జీవితం గడిపిన భగీరథ్, లీగల్ ప్రొసీడింగ్స్ పూర్తి చేసుకొని చర్లపల్లి జైలు నుంచి శనివారం విడుదలయ్యారు. హైదరాబాద్ శివారులోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మే 8వ తేదీ రాత్రి పది గంటల సమయంలో బండి భగీరథ్‌పై తొలి ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ప్రకారం 2025 డిసెంబర్ 31వ తేదీ రాత్రి న్యూ ఇయర్ వేడుకల సమయంలో బండి భగీరథ్, 17 ఏళ్ల తన కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపించారు. తీవ్రమైన ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ కేసును ప్రాథమిక దర్యాప్తు చేసి, నిందితుడిపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 74, సెక్షన్ 75తోపాటు పోక్సో యాక్ట్ 2012లోని సెక్షన్ 11, 12 కింద కేసు నమోదు చేశారు.

**నెలరోజులకుపైగా జైల్లోనే**

కేసు నమోదు కాగానే రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేగింది. ఈ కేసు విచారణ కోసం డీసీపీ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు అయ్యింది. బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం పోలీసులు చట్టపరమైన చర్యలను తీసుకున్నారు. అప్పుడు భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ ఉపశమనం లభించలేదు. దీంతో మే 16వ తేదీన పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌ను అరెస్టు చేసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో అధికారులు అతనిని చర్లపల్లి సెంట్రల్ జైలుకు పంపించారు. ఆ తర్వాత రిమాండ్‌ను మరింత పొడిగించంతో దాదాపు నెలరోజులకుపైగా అతను జైల్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు ఇంజినీరింగ్ పరీక్షలు ఉన్నాయని కోర్టుకు విన్నవించుకోవడంతో మధ్యంతర బెయిల్ ఇస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జూన్ 26 వరకు బండి భగీరథ్ ఇంటి వద్ద ఉండనున్నారు. దీనికి సంబంధించి కోర్టు కొన్ని షరతులను విధించింది.

# మహిళలు ఆర్థికంగా సంపన్నులు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయం

- **మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క**



**యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా** : మహిళలు ఆర్థికంగా సంపన్నులైతే , రాష్ట్రం సుసంపన్నంగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు.శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రం లో నూతన దుర్గా భాయ్ మహిళా శిశు వికాస కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన
రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి , శాఖ మంత్రి దనసరి.సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి , జిల్లా అనురాగ్ జయంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
మంత్రి సీతక్క మాట్లడుతూ అంగన్వాడీ టీచర్స్ కి గతంలో లేని విధంగా 61 సంవత్సరం వచ్చిన వారిని రిటైర్డ్ చేయడం జరిగింది. అంగన్వాడి టీచర్ల సమస్యలను తెలుసుకొని వాళ్ల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.ముఖ్యమంత్రి ఆలోచన మేరకు ఆడపడుచులకు పెట్రోల్ బంకులు, గోడౌన్, సోలార్ ప్లాంట్ లు మహిళ లకే ఇవ్వాలను ముఖ్యమంత్రి గారి ఆలోచన అని అన్నారు...
గతంలో 60 సంవత్సరాలు దాటిన మహిళలకు సమభావన సంఘంలో చోటు ఉండేది కాదని, ఇప్పుడు 60 సంవత్సరంములు దాటినా వారికి మహిళ సంఘము ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి ఆడబిడ్డల గురించి అలోచించి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.మహిళా సంఘములో ఉండి మహిళ లోన్ తీసుకొని చనిపోతే రెండు లక్షల లోన్ భీమా సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. మహిళల కోసం 5 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగింది, రాష్టంలో 61 వేలకోట్లరూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.మహిళ సంఘాలకు ఆలేరు నియోజకవర్గానికి 1250 కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇవ్వడం జరింగిందని మంత్రి తెలిపారు . మహిళలు బస్సు కి ఓనర్ చేయాలనే ఉద్దేశంతో, డ్రైవింగ్ శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 67 లక్షల మంది మహిళా సంఘాలలో ఉన్నారని, అందులో 12 లక్షల మందికి చదువు రానివారు ఉన్నారని, ఆరు లక్షల మందికి అమ్మకి అక్షరమాల క్రింద చదువు చెప్పించి, పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించరాని తెలిపారు.
భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆలేరు పట్టణంలో దుర్గా భాయ్ మహిళా శిశు వికాస కేంద్రం ఏర్పాటు చేసుకోవడం ఇది మహిళలందరికీ కూడా స్వయం ఉపాధికి ఒక మంచి ఆలోచన చేసినటువంటి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల కోసం ఇంత మంచి సెంటర్ ఏర్పాటు చేయడం మహిళలందరినీ ఒక శక్తివంతమైన చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని తదనుగుణంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను అనే ఒక నినాదంతో ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తూ ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరున ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోరీశ్వరులను చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళకు ఉపాధి కల్పించి ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.ప్రభుత్వ విప్ ,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం తీసుకొచ్చిన మహిళల పేరునే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇంట్లో మహిళా ఆర్థికంగా బలోపేతం అయ్యి ఉంటే ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసి మహిళలు కట్టిన రుణాలు వడ్డీ రుణాలగా తిరిగి మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం మహిళలను ఏ విషయాలలోనూ పట్టించుకోలేదని అదే ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చిన తరవాత మహిళా ఆత్మ గౌరవాన్ని పెంచుతూ ప్రతి సంక్షేమ కార్యక్రమం మహిళలతోనే మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. మహిళలు బలోపేతం అవ్వడానికి ఆర్టీసీ బస్సు ఓనర్లుగా ప్రభుత్వం మహిళలకు బస్సులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆలేరు పట్టణాన్ని అన్ని విధులుగా అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు హామీ ఇచ్చారు.
రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బండు శోభారాణి మాట్లాడుతూ.... ఆలేరు పట్టణంలో ఇంత మంచి దుర్గా భాయ్ మహిళ శిశు వికాస భవనం మహిళల కొరకు కట్టించినందుకు ముందుగా పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పై ప్రత్యేక దృష్టి పెట్టి మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మహిళలకు ఈ కేంద్రంలో వివిధ రకాల శిక్షణ తరగతులు నిర్వహించి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా ఉపయోగించి మరెన్నో సదుపాయాల కల్పన చేయాలన్నారు.
194 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 4,21,00,000 శ్రీనిధి బ్యాంకు లింకేజీ చెక్ ను అందజేశారు.621 స్వయం సహాయక సంఘాలకు 58,58,25,000/ బ్యాంకు లింకేజీ చెక్ ను మహిళలాసంఘాల సభ్యులకు అందజేయడం జరిగింది.
ఈ కార్యక్రమం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.







## ప్రతి తుఫాను వెనుక...

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వం లో రూపొందుతున్న తాజా సినిమా 'ఎన్‌బీకే111' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముంబై నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూన్ 19) కాజల్ అగర్వాల్ బర్త్ డే సందర్భంగా 'ఎన్‌బీకే 111' నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ప్రతి తుఫాను వెనుక ఓ కారణం ఉంటుంది' అంటూ కాజల్ పాత్ర స్వభావాన్ని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో తెలియజేసే ప్రయత్నం చేసింది యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: తమన్.



## ఫలించిన రుక్మిణి వసంత్ పోరాటం

**కృత్రిమ మేధ సాంకేతికత దుర్వినియోగం మరోసారి సినీ పరిశ్రమను కుదిపేసింది. ప్రముఖ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించినట్లు ప్రచారం చేసిన అసభ్యకర ఫొటోలు, వీడియోలు పూర్తిగా నకిలీవని తేలడంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టిన బెంగళూరు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా.. పలువురు నటి చూపించిన చొరవను అభినందిస్తున్నారు.**

'కాంతార' ఫేమ్ నటి రుక్మిణి వసంత్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అయిన బికినీ ఫొటోలు, వీడియోలు తీవ్ర వివాదానికి దారితీశాయి. స్విమ్మింగ్ పూల్ వద్ద బికినీలో ఫొటోషూట్ చేసినట్లు ప్రచారం కాగా.. ఆ వీడియోలు, ఫొటోలు పూర్తిగా ఏఐ సాయంతో సృష్టించినవేనని రుక్మిణి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తన వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘిస్తూ అసత్య ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.



''నా పేరుతో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలు అన్నీ ఫేక్. వాటిని ఏఐ సాయంతో రూపొందించారు. ఈ వ్యవహారాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. వాటిని సృష్టించిన వారిపైనా, ప్రచారం చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు ప్రారంభించాం'' అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ ఘటనపై రుక్మిణి వసంత్ బెంగళూరు నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఏఐ సాంకేతికతను ఉపయోగించి అభ్యంతరకర చిత్రాలు, వీడియోలు తయారుచేసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. దీనివల్ల తన గౌరవానికి భంగం కలగడమే కాకుండా మానసిక వేదనకు గురయ్యానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత (BNS)లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను గుర్తించిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించినట్లు భావిస్తున్న మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అరెస్ట్ అయిన వారిలో బాగలకోట జిల్లా చిలకముఖి గ్రామానికి చెందిన రవికుమార్ (24), ప్రస్తుతం బెంగళూరులోని కామాక్షిపాళ్యలో నివసిస్తున్న చంద్రకాంత్ (33), మహాలక్ష్మీనగర్‌కు చెందిన రంజిత్ (25) ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా, కేసుపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ఇటీవలి కాలంలో ఏఐ సాయంతో రూపొందిస్తున్న డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ చిత్రాలు సినీ తారలు, ప్రజా ప్రతినిధులు, సామాన్యులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా నటీమణుల ఫొటోలను అభ్యంతరకరంగా మార్చి వైరల్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. గతంలోనూ పబ్లిక్ ఈవెంట్లలో మహిళా నటీమణుల శరీర భాగాలను జూమ్ చేసి చిత్రీకరించడంపై రుక్మిణి వసంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏఐ సాయంతో ఏకంగా నకిలీ ఫొటోషూట్‌లను సృష్టించడంపై పోరాటం మొదలుపెట్టి విజయవంతం అయ్యారు.

ఇటీవల పలువురు సినీ నటీమణులు, టెలివిజన్ యాంకర్లు కూడా తమ పేర్లతో ప్రచారం అవుతున్న ఏఐ ఫొటోలు, వీడియోలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నటి, యాంకర్ అనసూయ కూడా ఈ అంశాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీప్‌ఫేక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం మరింత స్పష్టమవుతోంది.



## వీక్లీ పోల్‌లో బీటీఎస్ ప్రభంజనం..

**అంతర్జాతీయ పాప్ సంగీత ప్రపంచంలో కొరియన్ బ్యాండ్ 'బీటీఎస్' మరోసారి తన సత్తా చాటుకుంది. బిల్‌బోర్డ్ నిర్వహించిన అత్యంత ప్రజాదరణ పొందిన కొత్త సంగీతం పోల్‌లో బీటీఎస్ సరికొత్త డిజిటల్ సింగిల్ 'కమ్ ఓవర్' భారీ మెజారిటీతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.**

జూన్ 12 న ప్రారంభమైన ఈ పోలింగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బీటీఎస్ అభిమానులు భారీగా ఓట్లు వేయడంతో, ఏకంగా 86 శాతానికి పైగా ఓట్లతో ఈ పాట క్లీన్ స్వీప్ చేసింది. ఈ రేసులో హాలీవుడ్ పాప్ స్టార్ ఒలివియా రోడ్రిగో, జాక్ వైట్, బెబే రెక్సా, కాట్సే వంటి దిగ్గజ కళాకారుల కొత్త ఆల్బమ్‌లు పోటీలో ఉన్నప్పటికీ, బీటీఎస్ క్రేజ్ ముందు అవేవీ నిలవలేకపోయాయి. ఫలితంగా 'కమ్ ఓవర్' ఒకేపక్షంగా ల్యాండ్‌స్లైడ్ విజయాన్ని నమోదు చేసింది. రెండవ స్థానంలో ప్రముఖ పాప్ సింగర్ ఒలివియా రోడ్రిగో విడుదల చేసిన 'యూ సీమ్ ప్రెట్టీ శాడ్ ఫర్ ఎ గర్ల్ సో ఇన్ లవ్' ఆల్బమ్ నిలిచింది. 'కమ్ ఓవర్' అనేది బీటీఎస్ గతంలో విడుదల చేసిన 'అరిరంగ్' ఆల్బమ్‌కు సంబంధించిన బోనస్ ట్రాక్. ఇప్పటివరకు కేవలం ఫిజికల్ డీలక్స్ వినైల్ ఎడిషన్ లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ సాంగ్‌ను, బీటీఎస్ వార్షిక వేడుక 'ఫెస్టా' సందర్భంగా అధికారికంగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌స్‌లోకి విడుదల చేశారు. కొరియన్, ఇంగ్లీష్ భాషల కలయికతో సాగే ఈ సాంగ్.. దూరమైన ప్రాణస్నేహితుడిని లేదా ప్రియమైన వారిని తిరిగి కలుసుకోవాలనే ఆరాటాన్ని, పశ్చాత్తాపాన్ని ఎంతో భావోద్వేగంగా ఆవిష్కరిస్తుంది. బీటీఎస్ సభ్యులైన ఆర్ఎమ్, సుగా, జె-హోప్ స్వయంగా ఈ పాట నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం గ్లోబల్ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌పై 'కమ్ ఓవర్' స్ట్రీమింగ్ రికార్డులను తిరగరాస్తోంది.

## లైవ్ ఆల్బమ్‌తో శ్రేయా ఘోషల్ రికార్డు..

***భారతీయ చలనచిత్ర సంగీత ప్రపంచంలో తన మధురమైన గొంతుతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ సరికొత్త రికార్డుకు సిద్ధమయ్యారు. తన సుదీర్ఘ కెరీర్‌లో మొట్టమొదటిసారిగా ఒక 'లైవ్ కాన్సర్ట్ ఆల్బమ్'ను విడుదల చేయబోతున్నట్లు సోనీ మ్యూజిక్ ఇండియా అధికారికంగా ప్రకటించింది. ఇటీవలే ఆమె ప్రపంచవ్యాప్తంగా పూర్తి చేసిన 'ఆల్ హార్ట్స్' మ్యూజికల్ టూర్ విశేషాలతో ఈ ఆల్బమ్‌ను రూపొందించారు.***



ప్రపంచవ్యాప్తంగా 44 నగరాల్లో జరిగిన ఈ మ్యూజికల్ టూర్‌లో.. ముంబై, లండన్, న్యూయార్క్, ఆమ్‌స్టర్‌డామ్ వంటి ప్రముఖ నగరాల కాన్సర్ట్ స్టేజీలపై శ్రేయ లైవ్‌గా పాడిన ఐకానిక్ సాంగ్స్‌ను ఇందులో చేర్చారు. ఈ ఆల్బమ్‌లో శ్రేయా ఘోషల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలిచిన బాలీవుడ్ పాటలు ఉండబోతున్నాయి. ఈ మ్యూజికల్ టూర్‌లో భాగంగా లండన్ లోని ప్రఖ్యాత ఓవో ఎరీనా వెంబ్లీ, కాలిఫోర్నియాలోని ఓక్‌లాండ్ ఎరీనాల్లో శ్రేయ ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యంగా డెట్రాయిట్‌లోని 'ఫాక్స్ థియేటర్'లో గానకోకిల లతా మంగేష్కర్ తర్వాత ప్రదర్శన ఇచ్చిన రెండో భారతీయ కళాకారిణిగా శ్రేయా ఘోషల్ చరిత్ర సృష్టించారు. అలాగే లాస్ ఏంజిల్స్‌లోని ప్రసిద్ధ డాల్బీ థియేటర్ స్టేజ్‌పై పెర్ఫామ్ చేసిన ఏకైక భారతీయ సింగర్‌గా ఆమె రికార్డు సాధించారు.



## తమిళంలో మరిన్ని చిత్రాల్లో నటించాల్సింది : సమంత

నటి సమంత. ఈ పేరే ఒక సంచలనం. కథానాయకిగా కోలీవుడ్లో ఎంట్రీ ఇచ్చినా, అగ్ర కథానాయికిగా రాణిస్తుంది మాత్రం టాలీవుడ్ లోనే. అక్కడ స్టార్ హీరోలందరితోనూ జత కట్టేశారనే చెప్పాలి. కాగా వెబ్ సిరీస్ ద్వారా ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అయిన సమంత ఇటీవల నిర్మాతగానూ అవతారమెత్తారు. తొలి ప్రయత్నంగా శుభం అనే చిత్రాన్ని నిర్మించారు. మలి ప్రయత్నంగా ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై తన భర్త రాజ్ నిడిమోరు తో కలిసి నిర్మించి, నాయకిగా నటించిన చిత్రం మా ఇంటి బంగారం. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంలోనూ ఎంగళ్ తంగం పేరుతో శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల సామ్ తన చిత్ర టీమ్ తో చెన్నైలో సందడి చేశారు. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ ''చెన్నై తనకు ఎప్పుడూ ప్రత్యేకమే. సత్యం థియేటర్, ఈ పక్కనే నేను చదివిన కళాశాల ఇవన్నీ మంచి మెమోరీస్. తమిళంలో మరిన్ని చిత్రాలు చేసి ఉండాల్సింది. అయినా ఇంకా చాలా కాలం ఉంది. తమిళంలో మంచి కథా చిత్రాల కోసం ఎదురు చూస్తున్నాను.

ఇక ఎంగళ్ తంగం చిత్రం విషయానికి వేస్తే చిత్రాన్ని నిర్మించడం, విడుదల చేయడంలో నిర్మాతల కష్టం తెలిసి వచ్చింది. అయినా మంచి చిత్రం చేశారనే సంతోషం కలిగింది. ఇది యాక్షన్ తో కూడిన అనుబంధాలు మేళవించిన కుటుంబ కథా చిత్రంగా ఉంటుంది. చిత్రంలో యాక్షన్ సన్నివేశాల్లో ప్రేక్షకులను అలరిస్తాయి. ఎలాంటి కథా చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నారని అడుగుతున్నారని, అయితే మంచి జనరంజకమైన కథా చిత్రాల్లో నటించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు పాటలు సన్నివేశాల్లో నటించడం కంటే యాక్షన్ సన్నివేశాల్లో నటించడమే ఈజీగా ఉందని అన్నారు. ఎంగళ్ తంగం చిత్రం బాగా వచ్చిందని సమంత చెప్పారు. కాగా ఈమె పనిలో పనిగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో దిగిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.





## 'జననాయగన్' కోసం ఢిల్లీకి సీఎం విజయ్.. రిలీజ్ డేట్ ఫిక్స్?


ప్రముఖ నటుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇంతకు ముందు కథానాయకుడిగా నటించిన కొన్ని చిత్రాలు విడుదల సమయంలో సమస్యలు ఎదుర్కొన్నాయి కానీ , జననాయగన్ చిత్రం అంత పెద్ద సమస్యలను ఎదుర్కొన లేదని చెప్పవచ్చు. చిత్రం ప్రారంభం నుంచి పూర్తి అయ్యే వరకు చాలా స్మూత్‌గా జరిగిపోయింది. ఎటు తిరిగీ సెన్సార్ విషయంలోనే పీట ముడిపడింది. నిజానికి హెచ్ వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సెన్సార్ లో సమస్య ఎదురౌతుందని ఎవరు ఊహించలేదు. శాసనసభ ఎన్నికల సమయం కావడం, నటుడు విజయ్ పార్టీని ప్రారంభించి ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావడం వంటి విషయాలు తోడవడం, చిత్రంలో చర్చనీయాంశ సన్నివేశాలు చోటు చేసుకోవడంతో వంటి అంశాలు జననాయగన్ చిత్రానికి సెన్సార్ సమస్యలకు కారణం కావచ్చు. దీంతో గత జనవరి నెల నుంచి ఇప్పటి వరకు సుమారు 6 నెలలుగా ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో చిత్రం ఇంటర్నెట్లో అనధికారికంగా విడుదలై యూనిట్ సభ్యులకు పెద్ద షాక్ ఇచ్చింది. అయితే చిత్ర నిర్మాత వెంకట్ నారాయణన్ మాత్రం జననాయగన్ చిత్రాన్ని తెరపైకి తీసుకు రావడానికి శత విధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా ఆయన చిత్ర విడుదల విషయమై ఢిల్లీకి చేరుకున్నారు.

అక్కడ సెన్సార్ బోర్డు ప్రధాన అధికారితో మాట్లాడనున్నట్లు సమాచారం. దీంతో జననాయగన్ చిత్రానికి ఈ నెల 19వ తేదీ (శుక్రవారం) లోపల సర్టిఫికెట్ వస్తుందనే నమ్మకంతో యూనిట్ సభ్యులు ఉన్నారు. ఇదే జరిగితే జననాయగన్ చిత్రం ఈ నెల 25వ తేదీన తెరపైకి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. విజయ్ అభిమానులు జననాయగన్ చిత్ర విడుదల కోసం ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు.

## బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకుపోతున్న వైష్ణవి చైతన్య



ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్స్ లో వైష్ణవి చైతన్య ఒకరు. ఆమె గురించిన ముఖ్యమైన వివరాలు ఇక్కడ ఉన్నాయి యూట్యూబ్‌లో షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌ల ద్వారా వైష్ణవి తన కెరీర్‌ను ప్రారంభించింది. ముఖ్యంగా షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ఫ్యాన్స్ ను సొంతం చేసుకుంది. ఈ అమ్మడు హీరోయిన్ గా మారడానికి ముందు అల్లు అర్జున్ నటించిన 'అల వైకుంఠపురములో' సినిమాలో హీరో చెల్లెలిగా నటించింది. అలాగే నితిన్ హీరోగా నటించిన 'రంగ్ దే' సినిమాలో చిన్న పాత్రలలో కనిపించింది.. అలాగే మరికొన్ని సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. వైష్ణవి కెరీర్‌ను మలుపు తిప్పిన సినిమా 'బేబీ'. సాయి రాజేష్ దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రేమకథా చిత్రంలో ఆసూపర్ హిట్ అయ్యింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, నటిగా వైష్ణవికి మంచి గుర్తింపు తెచ్చునది. ప్రస్తుతం ఎపిక్ అనే సినిమా చేస్తుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని సరసన ఓ ప్రాజెక్ట్‌లో అలాగే శర్వానంద్ వంటి యంగ్ హీరోల సినిమాల్లోనూ ఆమె హీరోయిన్ గా చేసే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034